క్లుప్తంగా

గుండెపోటుతో హోంగార్డు మృతి



అంజనేయులు మృతదేహానికి పూలమాల వేస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

బత్తలపల్లి: హోంగార్డు నల్లపు అంజనేయులు(54) బుధవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ముదిగుబ్బ మండలం దొరిగిల్లులో ఆయన నివాసముంటున్నాడు. మృతునికి భార్య జయమ్మతో పాటు కుమారుడు ప్రసన్నకుమార్, కుమార్తె నీరజ ఉన్నారు. ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు, రూరల్ సీఐ ప్రభాకర్, ఎస్ఐ శ్రీనివాసులు, ఏఎస్ఐ సోమశేఖర్‌మూర్తి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, ఏఆర్ఏఎస్ఐ శామీర్‌లు గ్రామానికి చేరుకుని ఆంజనేయులు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంత్యక్రియలు నిమిత్తం కుటుంబ సభ్యులకు డీఎస్పీ శ్రీనివాసులు రూ.10వేలు, హోంగార్డు అసోసియేషన్ తరుపున రూ.10వేలు అందజేశారు.

రామగిరి ఎస్ఐగా సుధాకర్ యాదవ్



రామగిరి: మండల ఎస్ఐగా సుధాకర్‌యాదవ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గత సార్వత్రిక ఎన్నికల అనంతరం ఇక్కడ ఎస్ఐగా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు మెడికల్ లీవ్‌పై వెళ్లగా, రెండు నెలలుగా రామగిరికి ఎస్ఐ లేరు. వీఆర్‌లో ఉన్న సుధాకర్‌యాదవ్ ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు.

కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ



విజేతలతో కేజీబీవీ ప్రిన్సిపాల్ సౌజన్యకుమారి, పీఈటీ స్వర్ణ

పుట్టపర్తి: నరసరావుపేటలో జరిగిన రాష్ట్రస్థాయి ఫ్లోర్ బాల్ పోటీల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా తరపున బుక్కపట్నం కేజీబీవీ విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ నెల 1న జరిగిన రాష్ట్రస్థాయి 18వ ఫ్లోర్ బాల్ పోటీల్లో 2వ స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ సౌజన్యకుమారి, పీఈటీ స్వర్ణ బుధవారం తెలిపారు. ఈసందర్భంగా వారు పోటీల్లో కీలక భూమిక పోషించిన 8వ తరగతి విద్యార్థినులు వసంత, సాయిశ్రీని అభినందించారు.

వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి

గాండ్లపెంట/ నల్లచెరువు/ కనగానపల్లి: ఈ నెల 7న వినాయక చవితి వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని గాండ్లపెంట, నల్లచెరువు, కనగానపల్లి ఎస్ఐలు క్రిష్ణవేణి, లింగన్న, మల్లికార్జునరెడ్డి సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్లలో బుధవారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు.

జింకు లోపం..దిగుబడికి శాపం

- ధర్మవరం నియోజకవర్గవ్యాప్తంగా 9 వేల ఎకరాల్లో వరిసాగు
- చౌడు భూముల్లో జింకు లోపం
- ఎకరాకు 20 కేజీలు జింకు వాడాలని అధికారుల సూచన

బత్తలపల్లి: ఎరువు మంచిదే...పొలానికి బలాన్నిస్తుంది. అయితే అతిగా వాడడం వల్ల అనర్థాలకు దారితీస్తుంది. భూమిలో సారం తెలుసుకోకుండా ఇష్టానుసారం ఎరువుల వాడడంతో భూమిసారాన్ని చేజేతులా దెబ్బతీస్తున్నారు. ఎరువులు, పురుగుల మందులపై ఏటా రైతులు భారీగా ఖర్చు చేస్తున్నారు. విచక్షణా రహితంగా వీటిని వినియోగించటం వల్ల తిండి గింజలు విషతుల్యమవుతున్నాయి. అధిక దిగుబడులు వస్తాయన్న ఆపోహతో అవసరం లేకున్నా రైతులు ఎరువులు వినియోగిస్తున్నారని ఫెర్టిలైజర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నివేదిక స్పష్టం చేసింది. అయితే జింకు లోపాన్ని తెలుసుకుని వినియోగిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

ఆలస్యంగా పంటల సాగు..

ధర్మవరం నియోజకవర్గంలోని ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాల్లో సుమారు 9వేల ఎకరాల్లో వరిసాగుకు రైతులు సిద్ధపడుతున్నారు. ప్రస్తుతం నీరులేక ఖరీఫ్ పనులు ఆలస్యంగా సాగుతున్నాయి. గతేడాది కంటే ఈ సంవత్సరం మరీ ఆలస్యంగా పనులను రైతులు ప్రారంభించారు. మండలంలో సాగునీరు పారక భూములు చౌడుగా మారాయి. భూములు అధికంగానే చౌడు ఉన్నాయి. దానివల్ల రైతులకు జింకు లోపం వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని మండల వ్యవసాయ అధికారి ఓబిరెడ్డి తెలిపారు.



వరి సాగుకు భూమిని సిద్ధం చేసిన దృశ్యం

పొలాల్లో దమ్ము చేసిన తరువాత ఎకరాకు 20 కేజీల చొప్పున జింకును వాడితే జింకు లోపం వచ్చే అవకాశం ఉండదని చెప్పారు. దానివల్ల మొక్కకు పోషకాలు వెంటనే అందుతాయన్నారు. జింకు లోపం వస్తే వరి పసుపుగా పచ్చగా మారి ఎదుగుదల ఉండదని తెలిపారు.

తెగుళ్ల బారి నుంచి కాపాడుకునేందుకే..



పంటలు సాగు చేసిన తరువాత వాటికి సోకే తెగుళ్ల బారి నుంచి పంటలను కాపాడుకునేందుకు మందులను వాడాల్సి వస్తోంది. మందులు వాడకపోతే పంట దక్కుతుందో..లేదోనన్న భయంతో అప్పోసప్పో చేసి రైతులు మందులను పిచికారీ చేస్తున్నారు. దీనివల్ల జరిగే నష్టాలను గురించి రైతులు ఆలోచించడం లేదు.

–లింగమయ్య, రైతు, చెన్నరాయపట్నం, బత్తలపల్లి మండలం

భూసార పరీక్షల ఫలితాలు ఎప్పుడో..?



పంటలు సాగు చేసే సమయంలో ముందుగా పొలాల్లో భూసార పరీక్షలు చేయించుకొని అందుకు తగ్గట్టుగా మందులు వాడాలని అధికారులు చెబుతున్నారు. అయితే పరీక్షలకు పంపితే భూసార ఫలితాలు వచ్చేది ఎప్పుడో తెలియదు. అధికారులు మందులు అధికంగా వాడితే జరిగే అనర్థాలపై రైతులకు అవగాహన కల్పించలేదు. పంటలను కాపాడుకోవడానికి ఇంతకంటే మార్గం లేదు.

–దినేష్‌కుమార్‌రెడ్డి, రైతు, పోట్లమర్రి, బత్తలపల్లి మండలం

అధిక శాతం జింకులోపం ఉన్న భూములే..



మండలంలో అధిక శాతం భూములు జింకులోపం ఉన్నవే. రైతులు ఈ లోపంను నివారించుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చు. అయితే రైతులు అధికారుల సలహాలు పాటించడంలేదు. సాగు చేసిన పంటలను రక్షించుకుంటే చాలనుకుంటూ మందులను పిచికారీ చేసి చేజేతులా నష్టపోతున్నారు.

–ఓబిరెడ్డి, వ్యవసాయ అధికారి, బత్తలపల్లి

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



గాండ్లపెంటలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి బాబాఫక్రుద్దీన్



ఓడీచెరువు మండలం ఉగ్గిరెడ్డిపల్లిలో పౌష్టికాహార ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

గాండ్లపెంట: పౌష్టికాహారంతోనే ఆరోగ్యం సాధ్యమని వైద్యాధికారి డాక్టర్ బాబాఫక్రుద్దీన్ తెలిపారు. మలమీదపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం జాతీయ పౌష్టికాహార వారోత్సవాలపై బాలింతలు, గర్భిణులు, కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడం వల్ల గుండె జబ్బులు, మధుమేహం, క్యాన్సర్ , శ్వాస కోస వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. రోజూ పాలు, పండ్ల, కూరగాయలు మన ఆహారంలో ఉండేలా చూసుకోవాలన్నారు. సూపర్‌వైజర్ పార్వతమ్మ, వైద్య సిబ్బంది షహనాజ్, సరస్వతి, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓడీచెరువు: పౌష్టికాహార ప్రాముఖ్యతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయకుమారి పేర్కొన్నారు. ఉగ్గిరెడ్డిపల్లిలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయకుమారి ఆధ్వర్యంలో పౌష్టికాహార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల ఎదుగుదలలో పౌష్టికాహారం ఎంతో కీలకం అన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు లక్ష్మీ, ప్రమీల, షమీమ్, పార్వతమ్మ, శ్యామలమ్మ, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

నిరవధిక సమ్మెలోకి సత్యసాయి కార్మికులు

పుట్టపర్తి టౌన్: డిమాండ్ల సాధనలో భాగంగా గురువారం నుంచి సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు నిరవధిక సమ్మెలోకి వెళుతున్నారని సీఐటీయూ నాయకులు తెలిపారు. ఈ మేరకు డీఎస్పీ శ్రీనివాసరావుకు బుధవారం నోటీసు అందజేసి, మాట్లాడారు. మండల స్థాయిలో పంప్ హౌస్‌ల వద్ద 14 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని, దీంతో గురువారం నుంచి మున్సిపల్ కార్యాలయం పక్కన ఉన్న పంప్‌హౌస్ వద్ద సమ్మె నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పైపల్లి గంగాధర్, లక్ష్మీనారాయణ, తాగునీటి పథకం యూనియన్ నాయకులు మధు, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం సత్యసాయి తాగునీటి పథకం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఆరు నెలలుగా వేతనలు ఇవ్వకపోవడంతో సమ్మె చేస్తున్నామన్నారు. జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి వేతన బకాయిలు, ఈపీఎఫ్, ఈఎస్ఐ అందించాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లా ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి జగన్ మారుతి పాల్గొన్నారు.



డీఎస్పీ శ్రీనివాసరావుకు నోటీసు అందిస్తున్న దృశ్యం

కదిరి టౌన్: జిల్లా వ్యాప్తంగా శ్రీసత్యసాయి, శ్రీరామరెడ్డి తాగునీటి పథకాల కార్మికులు చేపడుతున్న గురువారం నుంచి చేపడుతున్న సమ్మెకు తమ మద్దతు ఉంటుందని సీఐటీయూ నేత జగన్మోహన్ పేర్కొన్నారు. పై రెండు పథకాల్లో 1300 కార్మికులు పనిచేస్తున్నారన్నారు.

తాడిమర్రి: పెండింగ్‌లో ఉన్న వేతనాలను ఇవ్వాలని సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు బుధవారం ఎనుముకు వినతిపత్రం అందజేసి నిరసన తెలియజేశారు. కార్మిక సంఘం నాయకులు ఎం.సతీష్, కే.పెద్దఓబిలేసు, పీ.తిరుపాల్, నాగార్జున, ఓబిరెడ్డి పాల్గొన్నారు.

ధన్వంతరి జయంత్యుత్సవ కమిటీ ఎన్నిక

ధర్మవరం అర్బన్: పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురంలో బుధవారం నాయీ బ్రాహ్మణులు వైద్య నారాయణ ధన్వంతరి జయంత్యుత్సవ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నికై ంది. ఉత్సవ కమిటీ గౌరవాధ్యక్షుడిగా పసులూరి శివశంకర్, కడియాల తిరుపతయ్య, అధ్యక్షుడిగా బూరగ ధనుంజయ, ఉపాధ్యక్షుడిగా కడియాల నారాయణస్వామి, ప్రధాన కార్యదర్శిగా తాడిమర్రి రామకృష్ణయ్య, ఉప కార్యదర్శిగా గొడ్డుమర్రి శ్రీనివాసులు, కోశాధికారిగా కొడవండ్లపల్లి జనార్ధన్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కోనాపురం సాయిప్రసాద్, గౌరవ సలహాదారులుగా దామోదర్, మాల్యవంతం చలపతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ధన్వంతరి జయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహించనున్నామని వారు తెలిపారు. కమిటీ సభ్యులు తాడిమర్రి రాము, గొడ్డుమర్రి ఆనంద్, దేవరపల్లి శివయ్య, కొడవండ్లపల్లి శ్రీనివాసులు, కడియాల మహేష్, రెడ్డిపల్లి వెంకటరమణ, పెద్దకోట్ల బాలయోగానంద తదితరులు పాల్గొన్నారు.

నేత్ర సంరక్షణపై దృష్టి సారించాలి

ధర్మవరం రూరల్: ప్రతి ఒక్కరు నేత్ర సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆఫ్తాలమిక్ అధికారులు ఉరుకుందప్ప, సికిందర్ పేర్కొన్నారు. దర్శనమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రావులచెర్వు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం వారు 39వ నేత్రదాన పక్షోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు నేత్రదానం ఆవశ్యకత, కంటి సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం వారు విద్యార్థులకు కంటివైద్య పరీక్షలు చేశారు. అనంతరం వారు పాఠశాల ఉపాధ్యాయులు, వైద్య సిబ్బందికి నేత్రదాన పక్షోత్సవాల ప్రతిజ్ఞ పత్రాలు ఇచ్చారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రాజశేఖర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్, ఏఎస్ఎం రేణుక, ఎంఎల్‌హెచ్‌పీ పరిమళ, ఆశాకార్యకర్తలు సావిత్రి, సరస్వతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులకు నేత్రదాన ప్రతిజ్ఞ పత్రాలు ఇస్తున్న దృశ్యం

14న జాతీయ లోక్‌అదాలత్



మాట్లాడుతున్న జడ్జి గీతావాణి

ధర్మవరం అర్బన్: స్థానిక కోర్టులో ఈనెల 14న జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహించనున్నామని సీనియర్ సివిల్ జడ్జి గీతావాణి తెలిపారు. బుధవారం ఆమె తన చాంబర్‌లో మాట్లాడుతూ రాజీకి అవకాశమున్న కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. కక్షిదారులు, పోలీసులు, న్యాయవాదులు, బ్యాంకు రుణం పెండింగ్ ఉన్నవారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ట్రాఫిక్ ఎస్ఐ బాధ్యతల స్వీకరణ



వెంకటరాముడు

ధర్మవరం అర్బన్: ధర్మవరం ట్రాఫిక్ ఎస్ఐగా వెంకటరాముడు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పుట్టపర్తి మహిళా పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈసందర్భంగా నూతన ట్రాఫిక్ ఎస్ఐ మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటానన్నారు. వాహనదారులు, పట్టణ ప్రజలు ఇందుకు సహకరించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

నల్లచెరువు: మండల కేంద్రంలోని బసవన్న కట్ట వద్ద బైక్ అదుపుతప్పి ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. కొత్త కమ్మవారిపల్లికి చెందిన శివ వ్యక్తిగత పనుల నిమిత్తం స్వగ్రామం నుంచి నల్లచెరువుకు బైక్‌పై వచ్చాడు. మండల కేంద్రంలోని బసవన్న కట్ట వద్దకు రాగానే బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

పండ్లతోటల పెంపకం లాభదాయకం

ధర్మవరం రూరల్: పండ్లతోటల పెంపకం లాభదాయకంగా ఉంటుందని ఎంపీడీఓ అబ్దుల్ నబీ పేర్కొన్నారు. మల్లాకాల్వలో రైతు రవీంద్రారెడ్డి పొలంలో ఉపాధి హామీ కింద మామిడి మొక్కలు నాటడానికి తీస్తున్న గుంతలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మామిడి మొక్కలు నాటి ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఓ అనిల్‌కుమార్‌రెడ్డి, టీఏ చంద్రకళ, సీనియర్ మేట్ రవి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలకు నమోదు చేసుకోండి

తలుపుల: గుండువారిపల్లి జెడ్పీహైస్కూల్‌లో ఈనెల 12, 13తేదీల్లో జరిగే అండర్ 14,17,19 క్రీడా పోటీలకు విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోవాలని మండల కోఆర్డినేటర్ లష్కర్‌నాయక్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల పీడీలు, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఎంట్రీ ఫారాలను తమకు అందజేయాలన్నారు.

సబ్సిడీ విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోండి

తాడిమర్రి: ఖరీఫ్ సీజన్‌లో ఎటువంటి పంటలు సాగు చేయని రైతులు సబ్సిడీపై అందించే ప్రత్యామ్నాయ విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏఓ రమాదేవి కోరారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ సబ్సిడీ పోగా ఉలవలు (పది కిలోలు) రూ.174, పెసలు (4 కిలోలు) రూ.104, జొన్నలు (3 కిలోలు) రూ.140, అలసందలు (10 కిలోలు) 226 అందుబాటులో ఉన్నాయన్నారు.

రైతు ఆత్మహత్య



గంగన్న (ఫైల్)

పుట్టపర్తి: అప్పుల బాధ తాళలేక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... బుక్కపట్నం మండలం చింతలయ్యగారిపల్లికి చెందిన దాసరి గంగన్న (68)కు ఇద్దరు పిల్లలు ఉన్నారు. తనకున్న 2.50 ఎకరాల్లో మొక్కజొన్న, వేరుశనగ, కలింగర, టమాట పంటల సాగుతో జీవనం సాగించేవాడు. గత మూడేళ్లుగా పంటలు పండక తీవ్రంగా నష్టపోయాడు. దీంతో పంటల సాగుకు చేసిన అప్పులకు వడ్డీల భారం పెరిగి రూ.7 లక్షలకు చేరుకుంది. ఈ క్రమంలో అప్పులు ఎలా తీర్చాలో తెలియక మదన పడుతున్న గంగన్న... మంగళవారం రాత్రి ఇంట్లోనే క్రిమి సంహారక మందు తాగాడు. అపస్మారక స్థితికి చేరుకున్న తండ్రిని గమనించి వెంటనే తన ఆటోలో బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్ గోవిందరెడ్డి, మాజీ ఎంపీటీసీ రంగారెడ్డి తదితరులు గంగన్న మృతదేహాన్ని పరిశీలించి, నివాళులర్పించారు. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి, అండగా ఉంటామని భరోసానిచ్చారు.

కంటి వైద్యశిబిరం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని నేత్రాలయ ఐ క్లినిక్‌లో బుధవారం యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కడప పుష్పగిరి కంటి ఆసుపత్రి వైద్యులు 60 మంది వృద్ధులకు కంటి పరీక్షలు చేసి 45 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వారందరికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయిస్తామని యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు శీలా నాగేంద్ర, కార్యదర్శి జయరాం, కోశాధికారి బండి నాగేంద్ర తెలిపారు. యువర్స్ ఫౌండేషన్ సభ్యులు పోలా ప్రభాకర్, చాంద్‌బాషా, డాక్టర్ సుబ్బారావు, శ్రీకాంత్‌రెడ్డి, నాగరాజాచారి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

హిందూపురం: స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 16వ తేదీ నుంచి కొత్తగా సివిల్ రివైట్ (ఆర్కిటెక్చర్) కోర్సు ప్రారంభించనున్నారు. ఈ మేరకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.హరీష్‌బాబు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కేవలం 30 సీట్లు మాత్రమే ఉన్నాయని తెలిపారు. 45 రోజుల కాల వ్యవధి ఉన్న ఈ కోర్సులో చేరేందుకు ఐటీఐ, డిప్లొమా, ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు అర్హులన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లను ఏపీ సాంకేతిక విద్యాశాఖ ప్రదానం చేస్తుందని తెలిపారు. వివరాలకు 94411 92027లో సంప్రదించాలని కోరారు.

సమాధులను కబ్జా చేస్తున్నా పట్టించుకోరా?

చెన్నేకొత్తపల్లి: దళిత కాలనీల్లో శ్మశానాల్లోని సమాధులను ధ్వంసం చేసి, కబ్జా చేస్తున్నా పట్టించుకోరా? అని ఎస్సీ,ఎస్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి ప్రశ్నించారు. బుధవారం బసంపల్లి వాసులతో కలిసి తహసీల్దార్ అనురాధను కలిశారు. అనంతరం సాకే హరి మాట్లాడుతూ బసంపల్లిలో సర్వే నం 17–1ఏలోని భూమిని కొన్నేళ్లుగా మాలలు శ్మశానంగా వాడుకుంటున్నారన్నారు.

మధ్యాహ్న భోజన నిర్వహణపై అవగాహన

నల్లచెరువు: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం మధ్యాహ్న భోజనం, మరుగుదొడ్ల నిర్వహణపై మండలంలోని ఎస్ఎంసీలు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు అవగాహన కల్పించారు. ఎంఈఓ తిరుపాల్ నాయక్ ప్రతి సోమ, గురువారం గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్, బుధ, శుక్రవారం ఎస్ఎంసీ చైర్మన్లు మధ్యాహ్న భోజనం, మరుగుదొడ్ల నిర్వహణను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఎంపీడీఓ శకుంతల తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగుపై అవగాహన

తలుపుల: గొల్లపల్లితండాలో బుధవారం పొలం బడి కార్యక్రమంలో భాగంగా వ్యవసాయాధికారులు పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఏడీఏ సత్యనారాయణ, ఏఓ షాదాబ్ వేరుశనగకు ఆశించి తెగుళ్ల, నివారణ చర్యలను వివరించారు. యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు పొందవచ్చని సూచించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు, ఎన్‌జీఓ సంస్థల సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

పుట్టపర్తి టౌన్: శ్రీవాణి బ్లోసమ్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అమెరికాకు చెందిన కమలమహమ్మద్ సహకారంతో ప్రశాంతి గ్రామం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు.

విద్యార్థులకు పర్యావరణంపై తెలియజేసి పాఠశాలలో మొక్కలు నాటించారు. పాఠశాల అభివృద్ధికి సహకారం అందిస్తామని దాతలు తెలిపారు. పాఠశాల హెచ్ఎం జగదీశ్వర పాల్గొన్నారు.

కంప్యూటర్ చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

నల్లమాడ: స్థానిక సర్కిల్ పోలీస్ కార్యాలయంలో ఇటీవల జరిగిన చోరీ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను బుధవారం పోలీస్ స్టేషన్‌లో సీఐ నరేంద్రరెడ్డి వెల్లడించారు. గతనెల 20వ తేది రాత్రి సర్కిల్ పోలీస్ కార్యాలయంలో కంప్యూటర్ ఇతర పరికరాలు చోరీకి గురయ్యాయి. కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన పోలీసులు నల్లమాడలో

సంక్షిప్త సమాచారం

నివాసం ఉండే సాయికుమార్ అనే యువకుడు సర్కిల్ పోలీస్ కార్యాలయంలోకి చొరబడి కంప్యూటర్ ఇతర పరికరాలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. బుధవారం నిందితుడు వైఎస్సార్ కూడలి వద్ద ఉన్నట్లు సమాచారం అందడంతో ఇన్‌చార్జ్ ఎస్ఐ వెంకటనారాయణ సిబ్బందితో వెళ్లి నిందితున్ని అరెస్ట్ చేశారు. నిందితున్ని పట్టుకోవడంలో చొరవచూపిన సిబ్బందిని సీఐ అభినందించారు. ఇన్‌చార్జ్ ఎస్ఐ వెంకటనారాయణ, ఏఎస్ఐ రఘురాములు, హెడ్ కానిస్టేబుల్ శంకర్ బాబు పాల్గొన్నారు.

పండ్ల మొక్కలు నాటే లక్ష్యం పూర్తి చేయాలి

కనగానపల్లి: డ్రైల్యాండ్ హార్టికల్చర్‌లో పండ్లమొక్కలు నాటే లక్ష్యం త్వరితగిన పూర్తి చేయాలని ఏపీడీ వెంకటచలపతి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన మండలంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులపై సమీక్షించారు.

ఘనంగా రత్నాకర్ జన్మదిన వేడుకలు



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న రత్నాకర్

పుట్టపర్తి టౌన్: శ్రీసత్యసాయి మేనేజింగ్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జే రత్నాకర్ 54వ జన్మదిన వేడుకలను అభిమానులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని రత్నాకర్ నివాసం వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకూ సందడి నెలకొంది. పలువురు అభిమానులు క్రేన్ ద్వారా గజమాలలు వేసి శుభాకాంక్షలు తెలియజేశారు. భారీ కేకులు ఏర్పాటు చేయగా రత్నాకర్ వాటిని ద్వారా కత్తిరించారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సేవలను విస్తృత పరుస్తామని రత్నాకర్ తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, బీజేపీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా పట్టణంలోని ఆర్‌వీజే కల్యాణ మండపంలో తోట్ల గంగాధర్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించగా రత్నాకర్ స్వయంగా వచ్చి వడ్డించారు. అనంతరం బ్రాహ్మణపల్లితండాలో 50 మంది వృద్ధులకు చేతికర్రలు అందజేశారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఓడీచెరువు: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ తుమ్మల పర్వీన్‌భాను అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరగనుంది. ప్రజాప్రతినిధులు, మండల అధికారులు హాజరుకావాలని ఎంపీపీ కోరారు.